క్లుప్తంగా

కనకదుర్గమ్మ విగ్రహప్రతిష్టా మహోత్సవం



పిట్టలవానిపాలెం: మండలంలోని సంగుపాలెం కోడూరు గ్రామంలో బుధవారం కనకదుర్గమ్మ వారి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. బుధవారం ఉదయం నుంచి ప్రారంభమైన ప్రత్యేక హోమాలు,పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక యాగశాలలో అర్చకులు పూజలు నిర్వహించారు. గురువారం కనకదుర్గమ్మ విగ్రహప్రతిష్టా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పెదపులివర్రులో సహస్ర దీపోత్సవం



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రులోని శ్రీ షిర్డీ సాయి బాబా మందిరంలో బుధవారం సామూహిక విష్ణు సహస్ర నామం, 1108 జ్యోతులు (సహస్ర దీపోత్సవం) వెలిగించి భక్తులు తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అఖిలాండ కోటి అఖండ జ్యోతి నిర్వాహకులు శ్రీరామ్‌జీ గురువు గురువారం పెదపులివర్రు విచ్చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే గత నెల 9 నుంచి జరుగుతున్న సప్త సప్తాహాలు ఈ నెల 31వ తేదీ పూర్ణాహుతితో ముగుస్తుందని తెలిపారు.

ముగిసిన మల్లేశ్వరుని బ్రహ్మోత్సవాలు



భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన భ్రమరాంబ మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. స్వామి వారి బ్రహ్మోత్సవాలే భట్టిప్రోలు తిరునాళ్లగా ప్రసిద్ధి గాంచాయి. రాత్రి పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. పూజా కార్యక్రమాలలో జగ్గారపు సూర్యనారాయణ – సామ్రాజ్యం దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాలను దేవాలయ కార్య నిర్వాహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు, వంశపారంపర్య ధర్మకర్తలు కొడాలి పానకాలరావు, రామశాస్త్రి, శంకరావు, లక్ష్మీకాంతారావు, అద్దేపల్లి – భట్టిప్రోలు పద్మశాలీయ బహుత్తమ సంఘీయులు పర్యవేక్షించారు.

పేటేరులో పశు వైద్యశిబిరం



రేపల్లె రూరల: మండలంలోని పేటేరు గ్రామంలో పంచాయతీ కార్యాలయ ఆవరణంలో గురువారం బుధవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచి కనపర్తి వసుమతి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యులు మీనాక్షి, ప్రవీణ్, లక్ష్మీ రంజిత, జగదీష్‌కుమార్, కరిముల్లాలు 115 పశువులకు వైద్య సేవలు అందించారు. 87 పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేయటంతో పాటు 28 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి కనపర్తి కిరణ్‌కుమార్, మండల ఉపాధ్యక్షురాలు రావు నెహ్రూలక్ష్మీ కుమారి ప్రభాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దోనేపూడి తిరునాళ్లకు సర్వం సిద్ధం



కొల్లూరు: తిరుపతమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు ఆలయ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో పూర్తయ్యాయి. మండలంలోని దోనేపూడిలో గురువారం ఉదయం నుంచి జరగనున్న తిరునాళ్లకు భారీ సంఖ్యలో భక్తులు హాజకానున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రానికి ఆలయం వద్ద అవసరమైన ఏర్పాట్లను పూర్తిచేశారు. కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయం పక్కన ఉన్న ప్రాంతంలో వాహనాలు నిలుపుకొనేందుకు, ఆలయం ఎదురుగా ఉన్న ప్రాంతంలో దుకాణాలు, క్రీడా పరికరాలను ఏర్పాటు చేశారు. తిరునాళ్ల సందర్భంగా ఈమార్గంలో తిరిగే వాహనాల రాకపోకలను కరకట్ట వైపుగా మళ్లించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ల అశ్విని రెడ్డి
- వాడవాడల ఘనంగా మహిళా దినోత్సవం కార్యక్రమాలు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ల అశ్విని రెడ్డి

పిట్టలవానిపాలెం: ప్రతి మహిళ ఆత్మ విశ్వాసం పెంపొందించుకుంటూ అన్ని రంగాలలో ముందంజలో ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ల అశ్వినిరెడ్డి తెలిపారు. పిట్టలవానిపాలెం మండలకేంద్రంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మహిళా చట్టాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అన్ని సంక్షేమ పథకాలను వారిపేరునే అందిస్తుందని గుర్తు చేశారు. అనంతరం గ్రామ మహిళా సమైఖ్య ఆధ్వర్యంలో అశ్వినిరెడ్డిని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అల్లూరులో...

అల్లూరు(పిట్టలవానిపాలెం): పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామంలో బుడేసాహెబ్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రస్టు వ్యవస్థాపకులు ఫజుల్ రెహమాన్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పొన్నూరు కీర్తీ వైద్యశాల వైద్యురాలు డాక్టర్ కీర్తి పాల్గొన్నారు. గ్రామ సర్పంచి ఉప్పు చెంచులక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు వాలి కృష్ణకుమారి, లక్ష్మీనరసింహస్వామి ట్రస్టు బోర్డు చైర్మన్ వాలి వెంకట శివారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ మండే విజయ్‌కుమార్, ట్రస్టు పర్యవేక్షకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

బాపట్ల అర్బన్: మహిళలు అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా ప్రతిభ చూపుతున్నారని కోన రమాదేవి అన్నారు. బాపట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రమాదేవి మాట్లాడుతూ ఆడ పిల్లలకు వారి అభిరుచికనుగుణంగా తమ భవిష్యత్‌ను ఎంచుకునే అవకాశం తల్లిదండ్రులు కల్పించాలన్నారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీ పడాలన్నారు. రమాదేవిని జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చినపోతుల హరిబాబు, ఉపాధ్యక్షురాలు కర్రా రమాదేవి, మండల సమాఖ్య అధ్యక్షులు జి.కరుణ, డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు: మహిళలు అన్నిరంగాలలో ముందుండాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి కోరారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం భట్టిప్రోలులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి మాట్లాడుతూ మహిళాభ్యుదయంతోనే నవ సమాజ నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. తొలుత పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు మండల సమాఖ్య మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ ఎంఎల్ శ్రావణ్‌కుమార్, ఏపీఎం కొండూరి శోభన్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రా స్వరాజ్యలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో...

బాపట్ల అర్బన్: యూటీఎఫ్ బాపట్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జె.పి.సంజోత అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా బాపట్ల మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం బి.రాజశ్రీ హాజరయ్యారు. రాజశ్రీ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. సంజోత మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితం మహిళలు నేడు ఈ స్థాయిలో ఉన్నారని పేర్కొన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జె.వినయ్‌కుమార్, జిల్లా కోశాధికారి ఎం.వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ కామ్రేడ్, భాస్కరరావు, డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: మహిళలు అన్నిరంగాలలో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని కర్లపాలెం సర్పంచి నక్కా లలితకుమారి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎన్.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బుధవారం వెలుగు కార్యాలయం ప్రాంగణంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించి మహిళలను సన్మానించారు. పశువైద్యాధికారి రేచల్ దివ్య యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, సీసీలు పూర్ణ చంద్రరావు, శివకోటేశ్వరరావు లక్ష్మీ సోమేశ్వరి, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, వీఓఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం..

రేపల్లె: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీనియర్ సివిల్ జడ్జి మహిళలకు బుధవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా చట్టాలపై మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను, వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన చట్టాలను వివరించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎల్.జగదీష్‌కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ, సీడీపీఓ మాణిక్యం, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. 17వవార్డులోని చేనేత సహకార కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పాల్గొని మహిళా దినోత్సవ విశిష్టతను వివరించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా విభాగంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, పలువురు కౌన్సిలర్‌లు మహిళా దినోత్సవ విశిష్టతను వివరించారు. అనంతరం పలువురు మహిళా కౌన్సిలర్‌లను, యానిమేటర్లను సత్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ విజయసారథి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోన రమాదేవిని సన్మానిస్తున్న మహిళ ప్రజాప్రతినిధులు, తదితరులు



భట్టిప్రోలులో ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ లలిత కుమారి, జెడ్పీటీసీ ఉదయభాస్కరి, మండల సమాఖ్య సిబ్బంది



ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు



రేపల్లె ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

12న ముత్తాయపాలెంలో 'బజరంగ్' కళ్లజోళ్ల పంపిణీ

కొరిటెపాడు(గుంటూరు): 'జగన్నామ సంక్షేమ సంవత్సరం' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6న బాపట్ల నియోజకవర్గంలోని ముత్తాయపాలెంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య పరీక్ష శిబిరంలో కళ్లజోళ్లు అవసరమైన వారికి యుద్ధ ప్రాతిపదిన వాటిని సిద్ధం చేయిస్తున్నామని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు రోజుల వ్యవధిలోనే 507 మంది పేద, నిరుపేదలు, మత్స్యకారులకు కళ్లజోళ్ల పంపిణీని ఈనెల 12న (ఆదివారం) సాయంత్రం 3.30 గంటలకు ముత్తాయపాలెంలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కళ్లజోళ్లకు ఎంపికైన వారందరూ ఆ రోజు గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి బొమ్మ వద్దకు వచ్చి తీసుకోవాలని ఆయన సూచించారు.

పరీక్ష కేంద్రం తొలగించడంపై ఆందోళన

భట్టిప్రోలు: మండల కేంద్రమైన భట్టిప్రోలులో ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షా కేంద్రాన్ని ఎత్తి వేయడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. భట్టిప్రోలు కేఎస్‌కే బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు చెరుకుపల్లి, కావూరు, నగరంలలో పరీక్షా కేంద్రాలు కేటాయించారు. ఈ కళాశాల నుంచి ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సుమారు 500 మంది హాజరవుతున్నారు. అలాగే స్థానిక ఎంఆర్‌ఆర్ అండ్ ఏవీఎస్ విద్యార్థులకు చెరుకుపల్లి, కావూరు, నగరంలలో రాఘవా జూనియర్ కళాశాల విద్యార్థులకు రేపల్లెలో సెంటర్ కేటాయించారు. మొత్తం మీద భట్టిప్రోలు నుంచి 600 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. విద్యార్థులు తమ ఇళ్ల వద్ద నుంచి గమ్య ప్రాంతాలకు నిర్ణీత సమయానికి చేరుకోవాలంటే కష్ట సాధ్యమైన పరిస్థితి నెలకొంది. ఉదయం 9 గంటలలోగా పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు విధిగా ఉండాలని బోర్డు ఆదేశాలు జారీ చేసింది. ఆయా కళాశాలకు చెందిన విద్యార్థులు చాలా మంది లంక గ్రామాలకు చెందిన వారు కావడం వల్ల పరీక్షా కేంద్రానికి చేరుకోవాలంటే మూడు, నాలుగు ఆటోలు మారాల్సిన పరిస్థితి నెలకొంది. జంబ్లింగ్ విధానం ద్వారా గతంలో భట్టిప్రోలులో ఎంఆర్ ఆర్ అండ్ ఏవీఎస్ కళాశాల, కేఎస్‌కే బాలికల జూనియర్ కళాశాలలో పరీక్షలు రాసేవారు. ఈ కళాశాల ఎత్తివేయడంతో 15 నుంచి 25 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న పరీక్షా కేంద్రాలకు వెళ్లి పరీక్షలు రాయాలంటే కష్టతరంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. పరిస్థితిని గమనించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



పెదపులివర్రులో వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న మంత్రి నాగార్జున

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- పెదపులివర్రులో గడప గడపకు మన ప్రభుత్వం

పెదపులివర్రు(భట్టిప్రోలు): దేశ చరిత్రలోనే ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి నాగార్జున పాల్గొన్నారు. ప్రజలను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. మంత్రి నాగార్జున గడప గడపకు వెళ్లి ఆయా గృహస్తులకు వివిధ సంక్షేమ పథకాల వల్ల చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. దీనికి సంబంధించిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు.

మంత్రి నాగార్జున మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందచేస్తున్న ఏకైక రాష్ట్రం కూడా మనదేనని అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. విశాఖ పట్నంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావడం హర్షణీయమన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, సర్పంచ్ నీలా ఉషారాణి, ఉప సర్పంచి కొర్ల మాధవ, గ్రామ పార్టీ కన్వీనర్ కొనకాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నీలా రమేష్, దావూరి నాగమల్లేశ్వరరావు, నీలా సతీష్, నీలా నాగరాజు, జంపని వెంకటేశ్వరరావు, ముత్తిరెడ్డి సాంబశివరావు, బుస్సా రాజారత్నం, వాకా శ్రీరామచంద్రమూర్తి, కొసరాజు సుబ్బారావు, కత్తుల వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, కంతమనేని హరిప్రసాద్ జంపని అంజయ్య పాల్గొన్నారు.

జగనన్న సుపరిపాలనలో అంతటా ఆనందం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: జగనన్న సుపరిపాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అంది అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని గుళ్లపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. తొలుత గ్రామంలోని ఆనందీశ్వర స్వామివారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ గుళ్లపల్లి గ్రామంలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు 27,57,48,877 లబ్ధి చేకూరిందన్నారు. గతంలో గ్రామంలో ప్రతి పనికి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదని, కానీ జగనన్న ప్రతి గ్రామంలో సచివాలయాన్ని ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు సత్వరం పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండి మరో మారు జగనన్నను ముఖ్యమంత్రిని చెయ్యటానికి ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని మోపిదేవి కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, జడ్పీటీసీ సభ్యురాలు మరివాడ పావని, మండల కన్వీనర్ పైనం ఏడుకొండల రెడ్డి, సర్పంచి చెన్ను శివమ్మ, ఎంపీటీసీ కాటూరి నిర్మల, నాయకులు చెన్ను కోటేశ్వరరావు, కామినేని కోటేశ్వరరావు, చీరాల ప్రసాద్‌రెడ్డి, దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి, ఉల్లంగుంట శ్రీరాంమూర్తి, బడుగు చంద్రపాల్, కాటూరి కృష్ణయ్య, వంగరుబాను, ఎంపీడీఓ శ్రీనివాసరావు, కార్యదర్శి విజయబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కోన రఘుపతి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం బాపట్ల పట్టణంలోని 24వ వార్డు సచివాలయంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా, సమస్యలు ఏమైనా ఉన్నాయా.. అంటూ ఆరా తీశారు. మూడున్నర సంవత్సరాలలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. నియోజకవర్గంలో అంతర్గత రోడ్లు, డ్రైయినేజీ నిర్మాణాలకు కృషి చేశామన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశామన్నారు. రాజకీయాలు, కులమతాలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్ బాబు, చేజర్ల నారాయణరెడ్డి, నక్కవీరారెడ్డి, శ్రీనివాసరావు, సయ్యద్ పీరా, ఆదిలక్ష్మి, ఆట్ల ప్రసాద్ రెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన భూనీళా సమేత వరదరాజ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం నిత్యహోమం, బలిహరణ, అవబృథోత్సవం, రాత్రి పూర్ణాహుతి, ధ్వజ అవరోహణం నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థాన కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కంతమనేని హరిప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు శాస్త్రయుక్తంగా జరిపారు. గురువారంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

శరీరం కాలిన బాలిక చికిత్స పొందుతూ మృతి

కొల్లూరు: ప్రమాదవశాత్తు శరీరం కాలిన బాలిక చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు గౌడపాలెంకు చెందిన అనంత విక్రమ్ కుమార్తె తేజశ్విని (10) గత నెల 22న ఇంటి వద్ద పొయ్యిలో పుల్లలు ఎగదోసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో బాలిక ధరించిన దుస్తులకు మంటలు వ్యాపించి గాయాల పాలయ్యింది. క్షతగాత్రురాలిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అప్పట్నుంచి చికిత్స పొందుతున్న బాలిక పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరపనున్నట్లు ఏఎస్‌ఐ రామయ్య తెలిపారు.

వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



ఐలవరం సొసైటీలో చేనేత కార్మికులతో మాట్లాడుతున్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

ఐలవరం(భట్టిప్రోలు): మారుతున్న కాలానికి అనుగుణంగా చేనేత కార్మికులు వస్త్రాలను రూపొందించాలని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి కోరారు. బుధవారం ఆయన భట్టిప్రోలు మండలం ఐలవరం చేనేత వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి మాచర్ల కోటేశ్వరరావు ఘనస్వాగతం పలికి పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు గట్టు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిరంజీవి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో చేనేత కార్మికులు కొత్తకొత్త డిజైన్లు తీర్చిదిద్దడంలో మెలకువలు పాటించాలని తెలిపారు. తద్వారా చేనేత కార్మికులకు ఆర్థికాభివృద్ధి చేకూరుతుందని అన్నారు. మాజీ ఎంపీపీలు అందే వెంకటేశ్వర్లు, మాచర్ల హేమసుందరరావు, స్థానిక నేతలు జొన్నాదుల నిశాంత్, జొన్నాదుల శరత్, సొసైటీ అధ్యక్షులు వెనిగళ్ల నాంచారయ్య, డైరెక్టర్లు జొన్నాదుల ఉమ, వంగర గంగాధరరావు, జొన్నాదుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



తెనాలిటౌన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని నందివెలుగు సర్పంచి, వైఎస్సార్ సీపీ నాయకుడు ధూళిపాళ్ళ పవన్‌కుమార్ పేర్కొన్నారు. తెనాలి-విజయవాడ రహదారిపై రూరల్ మండలం నందివెలుగు మెయిన్‌సెంటర్‌లో 'మేము సైతం' యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి చలివేంద్రాన్ని సర్పంచి పవన్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేము సైతం సేవా సంఘం సభ్యులు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సేవా సంఘం సెక్రటరీ షేక్ షకూర్ బాషా మాట్లాడుతూ గత అయిదు సంవత్సరాల నుంచి చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తూ ఈ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చుతున్నామన్నారు. సేవా సంఘం అధ్యక్షుడు కల్యాణం సాంబశివరావు, ఉపాధ్యక్షుడు యర్రమోతు జగన్మోహనరావు, కార్యదర్శి షకూర్ బాషా, సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో కోళ్లు మృతి

రేపల్లె రూరల్: పాకకు నిప్పంటుకుని మూగజీవాలైన గొర్రె, కోళ్లు మృతిచెందిన సంఘటన మండలంలోని పేటేరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామ వీఆర్వో నరేంద్ర వివరాల మేరకు దేవరకొండ లంకేశ్వరరావుకు చెందిన పూరిపాకకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. పాకలో ఉన్న ఒక గొర్రె సజీవ దహనం కాగా, మరో గొర్రెకు తీవ్రగాయాలయ్యాయి. అదేవిధంగా 30 కోళ్లు దగ్ధమయ్యాయని తెలిపారు. సుమారు రూ.40వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నాగేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్‌ఐ కె.వెంకటప్రసాద్

బాపట్లటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని కంకటపాలెం గ్రామం సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ కె.వెంకటప్రసాద్ కథనం ప్రకారం పట్టణంలోని మార్కెట్‌వీధిలో అడితీలు నిర్వహించే తమ్మిశెట్టి నాగేశ్వరరావు (65) బుధవారం కంకటపాలెం నుంచి బాపట్ల వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా అదే సమయంలో బాపట్ల నుంచి కంకటపాలెం వైపు వెళ్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ మేరకు రూరల్ ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.